ప్రమాదం వైపు ప్రయాణం

రామాటాకీస్ రోడ్డులో దర్జాగా రాంగ్ రూట్ ప్రయాణాలు

రహదారులపై వాహనాలు నడిపే వారు ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాల్సిందే. దీనివల్ల ప్రయాణం సాఫీగా సాగడమే కాకుండా ఎటువంటి రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా సురక్షితంగా గమ్యానికి చేరుకోవచ్చు. వేగంగా వెళ్లాలని, దగ్గర దారని రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే.. ఎదుటి వారికి ఇబ్బంది కలిగించడమే కాకుండా ప్రమాదాల బారిన పడవచ్చు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తే 99 శాతం సురక్షిత ప్రయాణం సాగించవచ్చు. ఈ విషయాన్ని కొందరు వాహన చోదకులు పెడచెవిన పెట్టి ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తున్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమని తెలిసినా.. రామాటాకీస్ రోడ్డులో నిత్యం ఇదే జరుగుతోంది. ఈ మార్గంలో దర్జాగా రాంగ్ రూట్ ప్రయాణాలు సాగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. – సీతంపేట


రామాటాకీస్ రోడ్డులో స్టాపర్ బోర్డులతో మూసివేసిన శ్రీనగర్ రహదారి


రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న ఆటో


రామాటాకీస్ రోడ్డులో ట్రావెల్స్ బస్సులతో నిలిచిపోయిన ట్రాఫిక్

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో ఇక్కట్లు

రామాటాకీస్ రోడ్డులో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు బారులు తీరుతుంటాయి. కంటి ఆస్పత్రి వద్ద పికప్ పాయింట్ ఏర్పాటు చేయడంతో ప్రతి రోజూ సాయంత్రం నుంచి బస్సులు ఒకదాని వెనుక మరొకటి క్యూ కడుతుంటాయి. పగటిపూట అంబేడ్కర్ భవన్ ముందు ట్రావెల్స్ బస్సులు డ్రాపింగ్ పాయింట్ ఏర్పాటు చేసుకున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులకు అంబేడ్కర్ భవన్ వద్ద దింపడం, పెద్ద కార్గో పార్సిళ్లు రోడ్డుపైన దింపి గంటల తరబడి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం నుంచి సీతమ్మధారకు వెళ్లే వాహనాలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది.

యథేచ్ఛగా బైక్‌లు, ఆటోల రాకపోకలు
ఇదే మార్గంలో ట్రావెల్స్ బస్సుల తిష్ట
తరచూ ప్రమాదాలు.. ట్రాఫిక్ సమస్యలు
దృష్టి సారించని ట్రాఫిక్ పోలీసులు

రామాటాకీస్ రోడ్డులో రాంగ్ రూట్‌లో వచ్చే చోదకులతో సరైన దారిలో ప్రయాణిస్తున్న వారికి ఇబ్బందికరంగా మారింది. ఇదేంటని రాంగ్ రూట్‌లో వస్తున్న వారిని ప్రశ్నిస్తే వెళ్లవయ్యా అంటూ.. పరుష పదజాలంతో తిడుతున్నారు. బుల్లయ్య కళాశాల రోడ్డు నుంచి ద్వారకానగర్ వైపు వెళ్లే మార్గంలో అంబేడ్కర్ భవన్ ఎదురుగా, శ్రీనగర్ కూడలిలో(ఎస్‌వీఆర్ ట్రావెల్స్ ఎదురుగా) స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహన చోదకులు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. చుట్టూ తిరిగి వెళ్లే ఓపిక, సమయం లేక దగ్గర దారి కావడంతో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాల పాలవుతున్నారు. ద్వారకానగర్ నుంచి శ్రీనగర్ మీదుగా రామాటాకీస్ కూడలికి వచ్చే మార్గం మూసివేయడంతో బైక్‌లు, ఆటోలు నిత్యం రాంగ్ రూట్‌లో వెళ్తున్నాయి. సీతమ్మధార, నక్కవానిపాలెం, సత్యం సెంటర్, రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట ప్రాంతాల వారు ద్వారకానగర్ వెళ్లడానికి రామాటాకీస్ కూడలికి ముందున్న శ్రీనగర్ రోడ్డులో ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ మార్గం మూసివేయడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. సీతంపేట, గణేష్‌నగర్ ప్రాంతాల నుంచి రామాటాకీస్, శ్రీనగర్ వెళ్లేందుకు సత్యం సెంటర్ వద్ద మలుపు తిరిగి టెక్ మహీంద్రా, బుల్లయ్య కళాశాల మీదుగా రామాటాకీస్ కూడలికి చేరుకోవాల్సి ఉంది. చుట్టూ తిరిగి వెళ్ల లేక డీఎంహెచ్‌వో కార్యాలయం, ప్రభుత్వ నేత్ర వైద్యశాల మీదుగా రాంగ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నారు.


అంబేడ్కర్ భవన్ ఎదుట రోడ్డుపై డంప్ చేసిన పార్సిళ్లు


రాంగ్ రూట్‌లో వెళ్తున్న ద్విచక్ర వాహన చోదకులు

మార్గాల మూసివేతతో కష్టాలు

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు రామాటాకీస్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు డివైడర్ వద్ద స్టాపర్ బోర్డులతో మూసివేశారు. అప్పటి నుంచి వాహన చోదకులకు కష్టాలు మొదలయ్యాయి. సీతమ్మధార, సత్యం సెంటర్ నుంచి వచ్చే వాహనాలు రామాటాకీస్ కూడలి వరకు వెళ్లి యూ టర్న్ తీసుకుని శ్రీనగర్ మీదుగా ద్వారకానగర్ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామాటాకీస్, శ్రీనగర్ నుంచి సత్యం సెంటర్‌కు, అటు మద్దిలపాలెం వైపు వెళ్లే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు ట్రావెల్స్ బస్సులు బారులు తీరి ఉన్నా.. వాటి పక్క నుంచి ప్రమాదకరంగా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. సరైన మార్గంలో వస్తున్న వారు వీరిని గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించి పరిష్కార మార్గం చూపాలని పలువురు కోరుతున్నారు.

రాంగ్ రూట్ ప్రయాణాలు నియంత్రించాలి



రామాటాకీస్ రోడ్డులో నిత్యం రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఈ రోడ్డులో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలిపివేస్తున్నారు. వాటి పక్క నుంచి రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇదేంటని అడిగితే తిడుతున్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణాలు నియంత్రించాలి.
– కె.ఎస్.ఎస్.రెడ్డి, సీతమ్మధార

ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలి



రామాటాకీస్ రోడ్డులో ఒకవైపు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు డ్రాపింగ్, పికప్ పాయింట్లు.. మరో వైపు ఎక్కడికక్కడ స్టాపర్ బోర్డులతో రహదారులు మూసివేయడం వల్ల సాఫీగా ప్రయాణం సాగే వీలు లేకుండా పోయింది. చుట్టూ తిరిగి వెళ్లలేక చాలా బైక్‌లు, ఆటోలు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి ఈ మార్గంలో సాఫీగా ప్రయాణాలు సాగేలా చూడాలి.
– టి.సంతోష్, రేసపువానిపాలెం

క్లుప్తంగా

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా


రైతులకు స్టాళ్లు కేటాయిస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం మొత్తం 170 స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం రైతులు 95 మంది, సాయంత్రం రైతులు 72 మంది, దుకాణాలు, స్టాళ్లకు డ్రా తీసి రైతులకు ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మట్లాడుతూ రైతులు విధిగా వారికి కేటాయించిన స్టాళ్లలోనే విక్రయాలు చేయాలని సూచించారు. స్టాళ్లు ఉన్న రైతులు కూరగాయలు నేల మీద విక్రయించరాదని కోరారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూస్తాం


కంచరపాలెం సీఐ చంద్రశేఖర్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదుదారుకు న్యాయం జరిగేలా చూస్తామని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా సెలవులో ఉన్న సమయంలో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికల ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉంటామని చెప్పారు. కంచరపాలెం పీఎస్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా.. వెంటనే పోలీసలకు తెలియజేయాలని కోరారు. ఫిర్యాదుదారులు కేసుల విచారణలో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నేరుగా తనను సంప్రదించవచ్చని సీఐ సూచించారు. తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు.

విరిగిపడిన కొండచరియల పరిశీలన


సత్యానగర్‌లో కూలిన గోడను పరిశీలిస్తున్న జెడ్సీ రాము

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు సత్యానగర్ కొండవాలు ప్రాంతంలో ఓ ఇంటిని ఆనుకుని ఉన్న కొండచరియలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఘటనా స్థలాన్ని సోమవారం జోన్–5 కమిషనర్ రాము సందర్శించి పరిశీలించారు. కొండచరియలను ఆనుకుని ఉన్న ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. విరిగిపడిన ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–5 ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, టీడీపీ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళతో హెడ్ కానిస్టేబుల్ దురుసు ప్రవర్తన

సీతమ్మధార: తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసిన ఒక మహిళతో ఫోర్త్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించారు. వివరాలిలా.. సీతమ్మధారలోని ఇండియన్ పెట్రోల్ బంక్‌లో డీజిల్ వేయించేందుకు ఆదివారం అర్ధరాత్రి ఒక మహిళ కారులో వచ్చింది. బంక్ సిబ్బంది కారులో డీజిల్ వేయకుండా పెట్రోల్ వేయడంతో ఆమె ప్రశ్నించింది. దీంతో బంకు యాజమాని ఆ మహిళపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆమె వెంటనే నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న హెడ్ కానిస్టేబుల్ గోపినాథ్ బంకు యజమానికి స్నేహితుడు కావటంతో మహిళదే తప్పు అన్నట్లు దురుసుగా ప్రవర్తించాడు. పైగా ఆమెకు సపోర్ట్‌గా ఉండేందుకు వచ్చిన బంధువుల వాహనాలను ఆపి పత్రాలు చూపించాలని బెదిరించాడు. మహిళలకు రాత్రి సమయంలో ఇబ్బంది వస్తే అండగా ఉండాల్సిన పోలీసులు ఇలా దురుసుగా ప్రవర్తించడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. హెడ్ కానిస్టేబుల్‌పై నగర పోలీస్ కమిషనర్ తక్షణం చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ కోరారు.

బీఈడీ పరీక్ష కేంద్రం తనిఖీ

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. వీటిని సోమవారం యూనివర్సిటీ పీజీ పరీక్షల డీన్ ఆచార్య కేశవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

బాలికలకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



పాపా హోంలో బాలికలకు సూచనలిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

సీతమ్మధార: విశాఖపట్నం గ్లోబల్ పింక్ ఆర్మీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సీతమ్మధార బాలికల పాపా హోంలో బాలికలు, అమ్మాయిల కోసం మహిళా సాధికారత, గైనిక్, యోగా, ఇతర విషయాలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పాపా హోం చైర్మన్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ బాలికలు, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆరోగ్యాన్ని కోల్పోతే జీవించలేం కనుక వ్యాధులకు సంబంధించి వైద్యులు ఇచ్చే సలహాలు, సూచనలను తప్పనిసరిగా పాటించి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. వైద్య శిబిరం నిర్వహించిన గ్లోబల్ పింక్ ఆర్మీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. బాలికలు మహిళల కోసం ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నట్టు గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ అధ్యక్షురాలు కొత్తపల్లి గీత తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు బాలికలకు సంపూర్ణ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను తెలిపి, మహిళల స్వీయరక్షణలో చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ శాఖ అధ్యక్షురాలు కొత్తపల్లి జ్యోతి, యోగా గురువు డాక్టర్ రేణుక, డాక్టర్ దేవిశ్రీ, పాపా హోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కోశాధికారి రమేష్ చంద్‌జైన్, బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 10.5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని సోమవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 10.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఒబిషేక్ మిస్త్రీ వారి వారి సిబ్బందితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వారా జిల్లాకు చెందిన గజానన్ కుర్వేంగే విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయిని రవాణా చేయడం ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి, అదుపులోకి తీసుకుని జీఆర్పీ ఎస్‌ఐకు అప్పగించారు. నిందితుడి నుంచి రూ.52.5 వేల విలువైన 10.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న మధుకుమార్

సీతంపేట: విజయాంధ్ర వ్యాయామ మండలి ఆదివారం నిర్వహించిన విశాఖ జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ కళాశాలకు చెందిన సిహెచ్.లోకేష్ 93 కిలోల విభాగంలో స్వర్ణం, కాంస్య పతకాలు సాధించగా, డిగ్రీ విద్యార్థి ఎ.మోహన్‌వెంకట్ 83 కిలోల విభాగంలో స్వర్ణ పతకం, ఎ.వరప్రసాద్ 74 కిలోల విభాగంలో రజత పతకం, రేవంత్‌రెడ్డి 105 కిలోల విభాగంలో రజత పతకం సాధించారు. పి.భార్గవ్ 120 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించగా, ఇంజినీరింగ్ విద్యార్థులు ఎం.డి.వసీం 74 కిలోల విభాగంలో స్వర్ణం, జి.రాఘవ అనూష 63 కిలోల విభాగంలో స్వర్ణ పతకం గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలను బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

సామాజిక భవనాలు నిర్మించాలని వినతి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు సమస్యలపై కార్పొరేటర్ గంకల కవిత సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రాలు అందజేశారు. కొండవాలు ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో సామాజిక భవనాలు ఏర్పాటు చేయాలని, ఇందిరానగర్‌లో కల్యాణ మండపం, రిటైనింగ్ వాల్ నిర్మాణాలు చేపట్టాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

డీఆర్‌ఎంను కలిసిన జీవీఎల్


డీఆర్‌ఎం లలిత్ బోరాకు లేఖ అందిస్తున్న జీవీఎల్ బృందం

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరాను సోమవారం బీజేపీ మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కలిశారు. ఈ సందర్భంగా జోన్ భవన నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం విశాఖ నుంచి గయ వరకు వీక్లీ ఎక్స్‌ప్రెస్ నడుస్తోందని, ఇది రెగ్యులర్‌గా నడిచేలా చేయాలని, విశాఖ నుంచి జోత్‌పూర్‌కు నడిచే వీక్లీ రైలును కూడా రెగ్యులర్ నడపాలని డీఆర్‌ఎంను ఆయన కోరారు. ప్రస్తుతం విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్– విశాఖపట్నం మధ్య నడుస్తున్న సమతా ఎక్స్‌ప్రెస్‌ను హర్యానాలోని హిస్సార్ వరకు పొడిగించాలన్నారు. పలు రైల్వే సమస్యలపై డీఆర్‌ఎంకు లేఖ అందించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, హర్యానా, బిహార్, రాజస్థాన్‌లకు చెందిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం


పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ శివప్రసాద్


అర్జీ పరిశీలిస్తున్న జోన్–5 కమిషనర్ రాము

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్‌ఐ ఇబ్రహీం, వీఆర్‌వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జోన్–3కి రెండు వినతులు

ఆశీలమెట్టలోని జోన్–3 కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ రెండు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్ టాక్స్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, ఆర్వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జోన్–5కు ఒకటే..

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ఒకే ఒక్క వినతి అందింది. జోనల్ కమిషనర్ బి.రాము మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒక ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదులను తక్షణం పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వాకర్స్ పార్కు అభివృద్ధికి చర్యలు


జెడ్సీ రామును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. వాకర్స్ పార్కును సోమవారం ఆయన సందర్శించారు. గతంలో వాకర్స్ పార్కులో అదనపు సౌకర్యాల కల్పనపై వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు జెడ్సీకి వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆయన వాకర్స్ పార్కును అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. శిథిలావస్థలకు చేరిన పార్కు ప్రహరీ గోడను నిర్మిచాలని, పెయింటింగ్ చేయించాలని, విద్యుద్దీకరణ, మట్టితో వాకింగ్ ట్రాక్ నిర్మించాలని వాకర్స్ క్లబ్ సభ్యులు కోరారు. దీనిపై వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌లతో జెడ్సీ చర్చించారు. చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్‌తో జెడ్సీ చర్చించి వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని సూచించారు. సిబ్బంది వాకింగ్ ట్రాక్ కోసం కొలతలు తీశారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్, ఈఈ దిలీప్, ఎలక్ట్రికల్ ఇంజినీర్, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్లకు సామాజిక భద్రత చట్టం అమలుచేయాలి


జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: క్యాబ్ డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన సామాజిక భద్రత చట్టాన్ని అమలుచేయాలని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, ఓలా, ఉబర్, రాపిడో కార్మికుల సమస్యలపై విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, జిల్లా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కష్టమర్లకు ఉపయోగపడే ఉబర్, రాపిడో, ఓలా తరహా యాప్ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ డ్రైవర్లకు ఉరితాడు వంటి మోటార్ వెహికల్ చట్టం–2019ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టోల్ చార్జీలు తగ్గించాలని, గ్రీన్ ట్యాక్స్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, పి.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.